క్లుప్తంగా

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ



ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎంలు

రోలుగుంట: విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలపై సోమవారం ఒక రోజు స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఎంఈవో–2 జగ్గారావు ఆధ్వర్యంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా కాంప్లెక్సు హెచ్ఎంలు బి.ఎస్.వి ప్రసాద్‌రావు, దాడిశెట్టి రమేష్‌కుమార్, కేజీబీవీ ఎస్వో తులసి శిక్షణ ఇచ్చారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసి ఎలా కూర్చోబెట్టాలి, పీపుల్స్ క్వశ్చనరీ, టీచర్స్ క్వశ్చనరీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎగ్జామ్స్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఫీల్డ్ నోట్స్ రాసే విధానం, ఎగ్జామ్స్ నిర్వహణ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అర్థమయే రీతిలో వివరించారు. సీఆర్పీలు, డీటీఈవో, ఎంఐఎస్, అకౌంటెంట్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



యూనియన్ సభ్యులకు సూచనలిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

రావికమతం: ట్రాఫిక్ రూల్స్‌ను ఆటో డ్రైవర్లు కచ్చితంగా పాటించాలని, ప్రతి ప్రయాణికుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. కొత్తకోట శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యులతో ఆయన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాల రికార్డుల నిర్వహణ విధిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి.బుల్లిబాబు, శేఖర్, నాగు, సత్తిబాబు, అప్పారావు, నాయుడు పాల్గొన్నారు.

2న బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వచ్చే నెల 2వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చెయ్యాలని వైఎస్సార్‌సీపీ చీడికాడ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, యూత్ విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు సోమవారం తెలిపారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సంక్షేమ లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు.

రాయితీపై పాడి రైతులకు రుణాలు



ఏరియా వెటర్నరీ ఆస్పత్రి ఏడీఏ రాంబాబు

నర్సీపట్నం: జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఔత్సాహిక రైతులకు రాయితీ రుణాలు అందిస్తున్నట్లు నర్సీపట్నం ఏరియా వెటర్నరీ ఆస్పత్రి ఏడీఏ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. పాడిపంటను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలు, పెరటికోళ్ల పెంపకానికి బ్యాంక్ లింకేజీ రుణాలు ఇస్తున్నాయన్నారు. 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో ఒక యూనిట్ ఏర్పాటు చేసినట్లయితే గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు రాయితీ రుణం ఇస్తున్నామన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

నాతవరం: మండలంలో ఖాళీ వలంటీర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీవో హనుమంతరావు సోమవారం తెలిపారు. పి.జగ్గంపేట, పి.కె.గూడెం, వల్సంపేట, గుమ్మడిగొండ, వెదురుపల్లి, పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున మన్యపురట్ల, వై.డి.పేట పంచాయతీల్లో రెండేసి చొప్పున మొత్తం తొమ్మిది వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వయసు ఈ ఏడాది అక్టోబరు 27వ తేదీ నాటికి 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న అభ్యర్థులకు వచ్చే నెల ఒకటో తేదీన తన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇందులో వచ్చిన మార్కులు ఆధారంగా అదే నెల 3న నియామక పత్రాలు ఇస్తామన్నారు.

ఓటమి భయంతోనే అయ్యన్న కొత్త పల్లవి

- టీడీపీ, జనసేన పార్టీకి ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా
- స్కామ్‌లు రుజువైతే జీవితాంతం జైల్లోనే చంద్రబాబు
- నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: రాష్ట్ర అభివృద్ధి కోసం తన సీటును త్యాగం చేస్తానని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని భయంతోనే పోటీ చేయడానికి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మండలంలో పెదగొలుగొండపేట, నాతవరం, తాండవ జంక్షన్, ఎ.శరభవరం గ్రామాల్లో ముఖ్య నాయకులు, గృహసారథులు, బూత్ కన్వీనర్లతో సమావేశాలు నిర్వహించారు. ఇంతవరకు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై చర్చించారు. అనంతరం నాతవరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీపై ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో చేసిన లక్షలాది రూపాయల స్కామ్‌లు నిజం కావాలని టీడీపీ నాయకులే కోరుకుంటున్నారన్నారు. స్కిల్ స్కామ్‌తోపాటు రింగ్ రోడ్డు పైపులైన్లతో అనేక స్కామ్ చంద్రబాబుపై ఉన్నాయని, అవన్నీ రుజువైతే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి ఉంటుందన్నారు. చంద్రబాబు చేసిన అవినీతిని కప్పిపుచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ 420 నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అనే చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగా పోటీ చేసే సత్తా లేక జనసేన పార్టీతో జత కట్టిందన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఆ పార్టీ నాయకుల్లో దడ మొదలైందన్నారు. ఆ రెండు పార్టీల నాయకులు ప్రజలను నమ్మించేందుకు చేసే తప్పుడు ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

9 నుంచి 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి'

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వచ్చే నెల 9వ తేదీ నుంచి ఏపీకి జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. 2014 ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక మాట మార్చి ప్రజలను ఏవిధంగా మోసం చేసారో ఇంటింటికి వివరించాలన్నారు. 2019 ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు సీఎం అయ్యాక 99 శాతం రాజకీయాలకు అతీతంగా నెరవేర్చిన విషయం తెలియజేసి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రజలు ఆదరణ చూస్తే నర్సీపట్నం నుంచి 30 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

సామాజిక బస్సు యాత్ర విజయవంతం చేయండి

నర్సీపట్నం నియోజకవర్గంలో వచ్చే నెల మూడో వారంలో రెండో విడతలో సామాజిక సాధికార బస్సు యాత్ర ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ బస్సు యాత్రను టీడీపీ, జనసేన క్యాడర్ గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా విజయవంతం చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో పని చేయాలన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నేత, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పైల పోతురాజు, శిరుసుపల్లి నర్సింగరావు, గన్నవరం పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, పార్టీ జిల్లా కార్యదర్శులు సబ్బవరపు వెంకునాయుడు, ఉలబాల శ్రీను, ఏఎంసీ డైరెక్టర్లు అడిగర్ల నాయుడు, బండి గంగరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాతవరం ఈవోపీఆర్డీగా నర్సింహమూర్తి



మూర్తిని అభినందిస్తున్న కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

నాతవరం: పంచాయతీ విస్తరణాధికారి(ఈవోపీఆర్డీ)గా ఎస్.వి.వి. నర్సింహమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన పంచాయతీ విస్తరణాధికారి లోకుల యాదగిరీశ్వరరావు పదోన్నతిపై రాజవొమ్మంగి ఎంపీడీవోగా వెళ్లిపోయారు. అప్పట్నుంచి నాతవరం పంచాయతీ కార్యదర్శి చినబాబు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీ విస్తరణాధికారి నర్సింహమూర్తి విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం ఆనందపురం పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శిగా పని చేస్తూ పదోన్నతిపై వచ్చారు. అతనికి మండలంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు అందించుట పంచాయతీలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారం, సూచనలు, సలహాల మేరకు పంచాయతీల్లో విధిగా సమావేశాలు నిర్వహించుట, ఆర్థిక వనరుల అభివృద్ధిపై దృష్టి సారిస్తానన్నారు.

15న ప్రజా రక్షణ భేరి సభ

గొలుగొండ: కేంద్రం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తెలిపారు. ఆయన గొలుగొండలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం వల్ల ఇక్కడ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నట్లు వాపోయారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు కర్మాగారం వంటి పథకాలు అమలు చేయకపోవడతో వచ్చే నెల 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి పార్టీ నాయకులంతా హాజరు కావాలని కోరారు. సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం గొడౌన్‌లో అగ్నిప్రమాదం



గొడౌన్ నుంచి ఎగసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం: పాత మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న సామగ్రి గొడౌన్‌లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఇందులో భద్రపరిచిన సామగ్రి అగ్నికి ఆహుతైంది. శానిటేషన్‌కు అవసరమైన బ్లీచింగ్, సున్నం, చీపుర్లు, దోమల నియంత్రణకు వినియోగించే ఆయిల్ నిల్వ చేశారు. అటువైపు సంచరించే వారు అగ్నిపుల్ల వేయడంతో గొడౌన్ ముందు చెత్త నుంచి వ్యాపించాయి. దీంతో సామగ్రి మొత్తం కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఫైర్ ఆఫీసర్ స్వామి, సిబ్బందితో వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ పరిశీలించారు. అగ్నిప్రమాదంపై ఆరా తీశారు. కార్మికులకు ఇవ్వాల్సిన గ్లౌజులు, చీపుర్లు, ఇతర సామగ్రిని భద్రలేని గొడౌన్‌లో ఎందుకు భద్రపరిచారని సిబ్బందిపై చైర్‌పర్సన్ ఆగ్రహించారు. దీనికి అధికారులు నీళ్ల నమిలారు.

ఉత్తమ విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థిని రోహిణికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకుడు అల్లాడ సురేష్

నర్సీపట్నం: చదువులో ప్రతిభ కనబరుస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని రోహిణికి అల్లాడ జగన్నాథరావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అల్లాడ సురేష్ ల్యాప్‌టాప్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ తరపున ప్రతి ఏడాది మంచి ప్రతిభ కనబరిచే విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిగా ల్యాప్‌టాప్ అందిస్తున్నామన్నారు. తన సహకారంతో ప్రయోజకులై పేద విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. ట్రస్ట్ సభ్యులు హరినాథ్ పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెట్ ప్రసాదుకు సన్మానం



పి.డి. ప్రసాదును సన్మానిస్తున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల రూరల్: విశాఖపట్నం జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో ఇటీవల కె.జె.పురం హైస్కూలు పీడీ కె. ప్రసాదు పతకాలు సాధించారు. ఆయన్ను సోమవారం కె.జె.పురం హైస్కూలులో ఘనంగా సన్మానించారు. తహసీల్దారు పి.వి.రత్నం, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాసరావు సారథ్యంలో శాలువా కప్పి సన్మానించారు.
సర్పంచ్ జామి రమణబాబు, నాయకులు కాళ్ల రాము, ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, హెచ్ఎం వి.దాసు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, వీఆర్వో పెదబాబు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు పూజలు



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం సతీమణి రమణమ్మ, భాస్కరరావు

దేవరాపల్లి: స్థానిక రామాలయం వద్ద ప్రత్యేక మండపంలో నెలకొల్పిన గౌరీ పరమేశ్వరులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, మండల మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, వేచలపు అప్పలనాయుడు, గాలి సూర్యలక్ష్మి, వేచలపు వాణి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ



అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, చీరలు అందజేస్తున్న ఈర్లె అనురాధ

దేవరాపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గిరిజనుడైన దిప్పల ఎరకన్నదొర కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ భరోసా కల్పించారు. ఈ మేరకు పాత వాలాబులో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో ఎరకన్నదొరకు చెందిన పూరి గుడిసెతోపాటు లక్ష రూపాయలు, తిండి గింజలు, భూమి పత్రాలు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తక్షణమే స్పందించారు. తన కుమార్తె ఈర్లె అనురాధతోపాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళ అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ తదితరులను బాధిత కుటుంబం వద్దకు సోమవారం పంపించారు. నిత్యావసర సరకులు, చీరలు, ఆర్థిక సాయం అందజేయించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు కావాల్సిన పుస్తకాలు తాను కొని పంపిస్తానని, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, కాలనీ ఇళ్లు మంజూరుకు కృషి చేస్తానని అనురాధ హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పోడెల నానిబాబు, పోడెల అన్నపూర్ణ, రాంబాబు పాల్గొన్నారు.

'సురక్ష'తో అందరికీ ఆరోగ్యం



ఓపీ తనిఖీ చేస్తున్న ఏడీఎంహెచ్‌వో వీరజ్యోతి




కె.జె.పురంలో రిజిస్ట్రేషన్ కోసం క్యూలో రోగులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు టి.వి.రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. సాధారణ రోగులు 546 మందిని వైద్యాధికారులు పరీక్షించారు. తహసీల్దారు పి.వి.రత్నం, మండల పరిషత్ ఏవో గోపాలరాజు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, కె.జె.పురం పీహెచ్‌సీ సీహెచ్‌వో పుష్పమ్మ, హెచ్‌వీ పుష్పకాంతం పర్యవేక్షించారు. సర్పంచ్ జామి రమణబాబు, నాయకులు కాళ్ల రాము, ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, జగన్, సూరిశెట్టి గోవిందరాజు, అచ్చిమినాయుడు, వీఆర్వో పెదబాబు పాల్గొన్నారు.

రావికమతం: గుడ్డిపలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 421 మంది హాజరయ్యారు. చిన్నపిల్లల వైద్యనిపుణుడు జి.నరేష్, రావికమతం, కొత్తకోట, మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరజని, దుర్గాప్రసాద్, రాజ్‌కుమార్ హాజరై రోగులకు సేవలందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి శిబిరాన్ని సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, సర్పంచ్ గుమ్మాల గణేశ్వరరావు పర్యవేక్షించారు.

6 రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల మంజూరు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం చెప్పారు. ఆరు రోడ్లు నిర్మాణానికి రూ. 15 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఈ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో దశాబ్దకాలంగా ఈ రోడ్లు అభివృద్ధి చేయకపోవడంతో ప్రధాన రహదారులన్నీ చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు ఇచ్చామని చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేశారన్నారు. రావికమతం మండలం చలిసింగ నుంచి సీకే పాడు రోడ్డు, మేడివాడ నుంచి కానాడ రోడ్డు, చినపాచిలి నుంచి వయా టి. అర్జాపురం మీదుగా బీఎస్ రోడ్డు వరకూ రోడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. చోడవరం మండలంలో బుచ్చెయ్యపేట జంక్షన్ నుంచి వయా బెన్నవోలు మీదుగా తిమ్మన్నపాలెం రోడ్డు, రోలుగుంట మండలంలో వడ్డిప నుంచి గౌరమ్మపేట రోడ్డు, బుచ్చెయ్యపేట మండలంలో రాజాం రోడ్డుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ వారంలో ఈ రోడ్లకు టెండర్లు పిలుస్తామన్నారు. మార్చిలోగా పనులు పూర్తి చేసి, ఆయా గ్రామాల రహదారి కష్టాలు తీర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ రోడ్ల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే నెల 3న సామర్థ్య పరీక్ష



మాకవరపాలెం: శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మాడుగుల: మాట్లాడుతున్న ఎంఈవో పాండురంగారావు తదితరులు

మాకవరపాలెం: వచ్చే నెల 3న విద్యా సాధన సర్వేలో భాగంగా విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్టు ఎంఈవోలు పి.ఎస్.ఎస్.మూర్తి, లక్ష్మి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ సర్వేకు సంబంధించి అన్ని పాఠశాలల హెచ్ఎంలతోపాటు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ జాతీయ సాధన సర్వేలో భాగంగా 3న మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలో సామర్థ్యాలను తెలుసుకునేందుకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. మొత్తం 21 పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా బీఈడీ, ఇంజినీరింగ్ విద్యార్థులను నియమించామన్నారు. వీరికి పరీక్ష ఏవిధంగా నిర్వహించాలనే విషయంపై శిక్షణ ఇచ్చామన్నారు. హెచ్ఎం అచ్యుతరామయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాడుగుల: స్టేట్ ఎడ్యుకేషన్ అకడమిక్ సర్వే (సీజ్) పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో ఎం. పాండురంగారావు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎంలతోపాటు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలో 25 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 1,200 మంది పరీక్షలు రాస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 బి.దేముడమ్మ, ఎంఆర్‌సీ సిబ్బంది నాగేంద్ర, రాజు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలో సమస్యకు పరిష్కారం

- ఆర్డీవో స్పందనకు 20 అర్జీలు



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన)లో 20 అర్జీలు వచ్చాయి. స్పందనలో ఆర్డీవో హెచ్.వి.జయరాం బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. కోర్టు పరిధిలో ఉన్న 60 సెంట్ల భూమికి ఎర్రచుక్క తొలగించి రావికమతం తహసీల్దార్ వేరొకరు పేరున ఆన్‌లైన్ చేశారని రావికమతం మండలం గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెంకు చెందిన యన్నంశెట్టి సత్తిబాబు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మిఠాయిలు తయారు చేసే దుకాణం నుంచి వెలువడుతున్న పొగ, వ్యర్థాల వల్ల చుట్టు పక్కల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మున్సిపాలిటీ 6వ వార్డుకు చెందిన వూక నాగేశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశాడు. 1.55 ఎకరాల జిరాయితీ భూమిని 22/ఎ నుంచి తొలగించాలని నాతవరం మండలం వల్సంపేటకు చెందిన పోలుపర్తి లక్ష్మి ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. 2022 నుంచి ఇదే సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని బాధితురాలు వాపోయింది. భూసమస్యలు, ఇళ్ల స్థలాలతో పాటు వివిధ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. స్పందన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆర్డీవో ఆయా శాఖల అధికారులకు సూచించారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిరండి



మాట్లాడుతున్న ఎంపీటీసీ అచ్చిబాబు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వెనుకబడిన వర్గాలకు రాజకీయ పదవుల్లో సముచిత స్థానం దక్కిందని కొరువాడ ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు అన్నారు. సోమవారం కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 2న మాడుగులలో నిర్వహించే ఈ బస్సు యాత్రకు ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపు మేరకు మధ్యాహ్నం 2 గంటలకు మాడుగులలో సభా స్థలికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ కొరువాడ గ్రామ అధ్యక్షుడు రెడ్డి నారాయణమూర్తి, గండి కోటి తదితరులు పాల్గొన్నారు.

లోసింగిలో వైద్య శిబిరం

- 27 మందికి చికిత్సలు
- నలుగురికి మలేరియా



లోసింగిలో రోగికి వైద్య పరీక్ష చేస్తున్న ఏఎన్ఎం రాజేశ్వరి

రోలుగుంట: అర్ల గిరిజన పంచాయతీ కొండ శిఖరాన ఉన్న కొత్త లోసింగి, పాత లోసింగి గ్రామాల్లో 15 రోజులుగా గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ సమస్యపై లోసింగిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సోమవారం సాక్షి పత్రికలో కథనం వచ్చింది. దీనిపై అధికారులు స్పందించి ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన 27 మంది రోగులకు ఏఎన్ఎం పి.రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ రమణ ఆరోగ్య పరీక్షలు చేశారు. వీరిలో నలుగురికి మలేరియా ఉన్నట్టు గుర్తించి మందులు ఇచ్చారు. దోమల ఉధ్రుతి అధికంగా ఉంటుందని, వీటి కాటు వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. ప్రతి ఇంట్లో దోమలతెరలు వాడాలన్నారు. మెరుగైన వైద్యం కోసం సమీప బుచ్చింపేట పీహెచ్‌సీకి రావాలని అక్కడ పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని రోగులకు సూచించారు. హెల్త్ అసిస్టెంట్ హరిబాబు, ఆశా సాయంతో ఆ గ్రామాల్లో రోడ్లు, మురుగు కూపాల వద్ద బావుల్లోను బ్లీచింగు చల్లించారు. ఈ శిబిరానికి వైద్యులు రాకపోవడంపై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై వైద్యురాలు సునీతను సంప్రదించగా పీహెచ్‌సీలో అత్యవసర విధులు నిర్వహించాల్సిన కారణంగా మధ్యాహ్నం రెండో వైద్యుడు శ్రీనివాసరాజును పంపించామన్నారు. అక్కడ రోగులు పీహెచ్‌సీకి రావడం లేదన్నారు. ఒక రోగిని శిబిరం నుంచి 108 వాహనంలో తీసుకొచ్చి వైద్యం అందించామన్నారు.